# 'నాకూ హిందూమతానికీ కళంకానివి...!'

* తోలేటి విశ్వనాధరావు *

ఆమెకు తెలివివచ్చేటప్పటికి తనొక మెత్తని పరుపుమీద పడుకొన్నట్లు తెలుసుకొంది. ఆమె కెదురుగుంటా ఒక మనిషికూడా ఉన్నాడు.

"కులాసాగా ఉందా" అని పరామర్శించాడు. ఆమె పరుపుమీద లేచి కూర్చొంది.

"నువ్వెవ్వరవు? నే నెక్కడ ఉన్నాను" భయంతో వణుకుతూ అడిగింది.

"నేను అబ్దుల్ కరీమ్‌ను. నువ్వు నా యింట్లో ఉన్నావు" అని సున్నితంగా సమాధానం యిచ్చాడు.

"నా భర్తకేం జరిగింది?"

"అతడ్ని చంపివేసారు" అన్నాడు. ఆ సమాధానానికి ఆమె ముహంలో విషాదరేఖలు కనబడలేదు.

"నన్ను మా యింటికి పోనిస్తావా?" హీన స్వరంతో అడిగింది.

"ఇల్లా? ఏం యిల్లూ? నీ వింకా జరిగినదేమిటో గ్రహించుకోలేదనుకుంటా. నీకు యిల్లు లేదు. అది పూర్తిగా తగులడిపోయింది. నీ భర్తతో బాటు నేలమట్టమయింది." దీనికామె నిజంగా హడలిపోయింది.

"నా తండ్రి ప్రసాదముఖర్జీ, నా తల్లి, అన్నా చెల్లెలు, వాళ్ళేమయ్యారు" అతను సమాధానమేమి ఇవ్వలేదు.

ఉమ జరిగిందేమిటో గ్రహించుకుంది.

"వాళ్ళందర్నీ చంపేసారా?" అంది శోకిస్తూ.

"అబ్బే, నీ తండ్రి యిస్లాం స్వీకరించి సజీవంగా వున్నాడు. తల్లి అన్న చనిపోయారు. నీ చెల్లెలు మాయమయింది. ఎక్కడకు పోయిందో తెలియదు."

"నన్ను, నావాళ్లనిగురించి యింతగా నీ కెలా తెలుసు" అంది లేని ధైర్యం తెచ్చుకొని.

"నేను యీ వూళ్ళో ఒక భూస్వామిని. నా తండ్రి చనిపోయింతర్వాత కొన్ని వారాల వెనకే యిక్కడికి వచ్చాను. నువ్వు కాళీ దేవాలయానికి వెళ్లుతూన్నప్పుడు నిన్ను నే చూచాను. జమీందారు భార్యవనికూడా తెలుసుకున్నాను. అంత అందమయిన నీకు ముసలివానితో పెళ్ళి జరగడం నాకు ఆశ్చర్యంవేసింది. అప్పుడే నీ గురించి కూపీ తీసాను."

అతని మాటలో తీపితనం కనిపించింది. కరీం కళ్లు ప్రేమజ్యోతుల్ని వెదజల్లాయి. స్త్రీకి నైజంగా ఉండే గుణంకొద్దీ ఆమె తలతోపాటు కళ్ళనికూడా క్రిందకు వంచింది.

కాని ఆ మరుక్షణంలోనే "నేనిప్పుడు ఏం చెయ్యాలి? నే నెక్కడికి పోను. నా తండ్రి ఎక్కడ" అన్నది విషాదపూరితమయిన రుద్ధ కంఠంతో.

"ఇప్పుడు నీ తండ్రిదగ్గరకు పోలేవు. అతనిప్పుడు ఖైదీ. నీ తండ్రిని ఇస్లాంలో కలిసిన యితరుల్ని పారిపోకుండా జాగ్రత్తగా కాస్తున్నారు. వాళ్లు సురక్షితంగా మాసుక్కలో ఉన్నారు."

"నువ్వు నన్నిక్కడ కెలా తీసుకువచ్చావ్" అన్నది. యీ ప్రశ్నకి అతనికి ఆశ్చర్యంవేసింది.

"నేనుకూడా ఆ గుంపుతో వెళ్ళాను. నువ్వు కనబడితే రక్షిద్దామనే ఉద్దేశంతో. వాళ్ళు నిన్ను ఆ చిన్న గదిలోంచి పైకి లాగినప్పుడు నే నక్కడే ఉన్నాను. అప్పుడే నిన్ను పట్టుకొని నాదానవని చెప్పా. దానికెవరూ అడ్డుపెట్టలేదు. నువ్వు మూర్ఛలో ఉన్నావ్. నిన్ను మా యింటికి మోసుకువచ్చాను. అప్పటికే కొన్ని గంటలవరకు మూర్ఛలో ఉన్నావ్. నీకు తెలివి వచ్చేవరకు కనిపెట్టుకుని కూర్చున్నా."

"నన్నిప్పుడేమి చేయదల్చుకున్నావ్" అని అడిగింది భయం వెంటతరుముతూన్నదానిలా అతని ఆశ్చర్యాన్ని మరింత రెట్టిస్తూ.

"నీకు స్పృహవచ్చినతరువాత నిన్ను నేను పెళ్లి చేసుకుంటాను అని మౌల్వీకి వాగ్దానం చెయ్యడం వల్లే నిన్ను రక్షించగలిగాను. ఎప్పుడో ఒకసారి అతను యిక్కడికి వస్తాడు."

"ఇది ఘోరం" అని ఏడిచింది. "నిన్ను నేను పెళ్ళిచేసుకోవడానికి బలవంతపెడతారా? పూర్తిగా నయినా విధవను కాలేదు. మళ్లీ అంత తొందరగా పెళ్ళిచేసుకోవాలా?" అతను మారుపలుకలేదు.

ఆమె నిశ్చల నిరీహ నిరీవ నేత్రాలగుండా అశ్రుధారలు స్రవించినాయ్. ఎంత విషాదంగా విలపించింది!

"ఏడవకు" అని ఓదార్చాడు మృదువుగా. "నీకు అయిష్టమయిన కార్యమేదీ నిన్ను చెయ్యమని బలవంతపెట్టను. కాని యిక్కడ మనుష్యుల స్వభావం గ్రహించనట్లు కనబడుతున్నావు. వాళ్లు కలకత్తాలోని ముస్లింరక్తానికి బదులుగా హిందూ రక్తాన్ని కోరుతున్నారు. నువ్వు నన్ను పెళ్ళి చేసుకోకపోతే వాళ్లు యింకొకళ్ళకిచ్చి బలవంతంగా పెళ్ళి చేస్తారు. నీ తండ్రి ప్రాణంమీది తీపితో వాళ్ళేమిచేయమన్నా చెయ్యడానికి సిద్ధంగా ఉన్నాడు. అతను నువ్వు నన్ను పెళ్ళి చేసుకోవడం యిష్టమే అంటాడు: అతను అధమం యీ క్షణంలో ముస్లిం. నువ్వుకూడా అంతే అవాలి. ప్రాణాల్ని రక్షించుకోవాలంటే నువ్వు ఎవళ్లనో ఒకళ్ళని పెళ్ళాడాలి."

ఆమెకు ఏమనాలో, ఏం చెయ్యాలో తోచలేదు. తప్పించుకోడానికి వీల్లేని ఒక సమస్యను ఎదుర్కోవలసివచ్చిందామె.

"నేనొక ఉపాయం చెప్తాను" అన్నాడు ఆఖరిగా. "నన్ను ప్రస్తుతం పెళ్ళిచేసుకో. వాళ్ల ప్రతీకారవాంఛ అణిగిపోయింతర్వాత నిన్ను కలకత్తా తీసుకుపోయి అక్కడే వదిలేస్తాను. అప్పుడు నువ్వు స్వతంత్రురాలవు అవుతావు. ఈ ప్రాంతాలకి మిలిటరీ వస్తుంది. వారు దొంగిలింపబడ్డ హిందూ స్త్రీలందరికోసం వెతుకుతారు. అప్పుడు నువ్వు వాళ్ళతో వెళ్ళిపోవచ్చు, ప్రస్తుతం అంతకన్నా వేరే ఉపాయంలేదు. నీకేహానీ చెయ్యను నువ్వు అపురూప సౌందర్యవతివైనా" అన్నాడు.

ఉష నిశ్చయం చేసుకొంది. తన్ని ఏవిధంగాను రక్షించడంగాని, సానుభూతి చూపడంగాని చెయ్యని సంఘానికి భయపడవలసిన అవసరంలేదు.

ఉష గత్యంతరంలేక ఆ ముస్లింయువకుణ్ని పెండ్లాడింది. వారంరోజులు గడిచాయ్. ఆమె విముక్తి అయ్యే క్షణంకోసం ఎదురుచూస్తోంది.

## ఆనందవాణి పోస్టుబాక్సు నెంబరు

# 1583

చందాదారులు, వ్యాసకర్తలు, ఏజెంట్లు తాము ఆనందవాణికి వ్రాసే ఉత్తరాల చిరునామాలో పై నెంబరును తప్పక ఉదాహరించవలెను. లేనిచో మాకు ఆ జాబులు చేరడంలో ఆలస్యం జరగవచ్చు.

—మేనేజరు

కాని ఆమెలో తీవ్ర అసంతృప్తి, పరితాపం, ప్రతీకారం చెలరేగుతున్నాయ్.

ఒకరోజున ఆమె తండ్రి బోడితలతో ఆమెను చూడానికి వచ్చాడు. కాని కూడా ఉన్న మౌల్వీ అట్టేసేపు కూతురిదగ్గర నిలవనివ్వలేదు.

ఆ మరుసటిరాత్రి అబ్దుల్ కరీం ఆమె గదికి వచ్చాడు. ఆమె అక్కడ ఉండగా అదే మొదటిసారి రావడం.


"మిలటరీ వచ్చింది" అన్నాడు కోపిష్టుగా. "రక్షకదళాలుకూడా వచ్చాయి. వారు జమీందారుగారి సంసారంకోసం వెతుకుతున్నారు. నువ్విక్కడ ఉన్నట్టు వాళ్ళు తెలుసుకోగలరు. నీ తండ్రి వాళ్లచేతుల్లో చిక్కాడు. అతనే నా చెప్తాడు." ఆమె మౌనంగా ఊరుకుంది.

"వాళ్లు నిన్ను దొంగిలించినందుకు నన్ను ఖైదుచేస్తారు."

"నీకీ కష్టం తీసుకువచ్చినందుకు చాలా విచారం" అంది ఆ మరుక్షణంలో.

"నిజంగా" అన్నాడు నవ్వుతూ. ఆ నవ్వు ఆమె యౌవ్వనాన్ని ఒక్కసారిగా ఉప్పొంగ చేసింది. "నిన్ను దొంగిలించానని ఎవడైనా అనుకుంటాడు,"

"వాళ్ళతో నే నిక్కడికి నా స్వబుద్ధితో వచ్చానని చెప్తా. అప్పుడు నిన్నేమీ చెయ్యరు" అంది.




ఊపిరితిత్తుల వ్యాధులకు పురోహిత్ వారి శ్వాసహరి వాడాలని వైద్యులు చెప్పుతారు. ఇతర మందులచే ఉబ్బస వ్యాధి త్వరగా కుదర్చబడున్ననుట అబద్ధము. అవి వ్యాధిని నిర్మూలించక లక్షణాలను అణచిపెట్టి మరింత జాస్తిఅగునట్టు చేస్తాయి.

పురోహిత్ వారి శ్వాసహరి శాశ్వతంగా వ్యాధిని కుదుర్చును. మీరు సుఖంగా నిద్రపోతారు. సుఖంగా భోజనం చేస్తారు. బాగా అరిగించుకుంటారు. క్రమముగా ఆరోగ్యం బాగుపడుతుంది. మీ ఊపిరితిత్తులు బలపడును. ఉబ్బసం శాశ్వతంగా తగ్గిపోతుంది.

రు. 2-6-0, 5-12-0, 10-0-0 ల ధరలలో, 3, 6, 12 ఔన్సుల సీసాలు లభ్యమగును. కావలసినవారు ఇంగ్లీషులో జాబులు వ్రాయాలి.

తయారుచేయువారు :

డాక్టర్ ... ఫార్మసీ,

...ల్హాపూర్.

స్టాకిస్టులు: మెసర్స్ అప్పా & కో.,
కెమిస్ట్సు, చైనాబజార్, మద్రాసు.

ఉబ్బసాన్ని పోగొట్టేందుకు
డాక్టర్ల మంచి మందు
శ్వాసహారి




పురోహిత్ శ్వాసహారి
DR. PUROHIT PHARMACY, KOLHAPUR.

''చెయ్యడం చెప్పడమంత సులువుకాదు. నీకెవ్వరూ సాక్ష్యం యివ్వరు. అయినా వాళ్ళు కేవరడ్డొస్తారు?''

''కాని నేనలా చెప్పనప్పుడు వాళ్లేం చెయ్యగలరు.''

''మంచిది'' అన్నాడు తీక్షణంగా. ''నేను అధికారుల చేతులలోగాని, నా కులంవాళ్ళ చేతులలోగాని చిక్కుల్లోపడను. నా కులంవాళ్లు ఘర్షణలేకుండా నిన్ను యిచ్చివేయడానికి ఒప్పుకోరు. నిన్ను ప్రస్తుతం దాచిపెట్టేయమని వాళ్ళ దగ్గరనుంచి సలహాలు వచ్చాయి.''

''నా గురించి నీవు యిబ్బందిలోపడటం అసహ్యించుకుంటాను'' అంది.

''నాకు నువ్వు చాలా దయగా, మర్యాదగా, మంచిదానివిలా కనుపిస్తున్నావ్.''

''నీకు అదెంత కష్టమయిన పనో తెలియదు. నా చేతుల్లో అంత అందమైన స్త్రీని పెట్టుకుని ప్రేమించి, మోహించి, ఆమె దగ్గరకు కూడా వెళ్ళకుండా ఉండటం, నిన్ను ఆపదలోంచి తప్పించాను. నిన్ను చూసినప్పటినుంచీ నిన్ను ప్రేమించాను. ఇంతకాలంనుంచీ నిన్ను తల్చుకుంటూ ఉన్నాను. నేనేమీ యోగిని కాను. మనుష్యమాత్రుణ్ణి! నిన్ను ప్రేమించాను. మోహించాను. నీవాళ్లు అందరూ చిత్రవధ చేయబడ్డారని చెపితే నీవు దుఃఖిస్తావని కూడా తెలుసు. కాని నువ్వు వెళ్ళిపోయేముందు నీకిది తెలియపర్చదలుచుకొన్నాను. నువ్వు నా భార్యవు కాకపోయినా నిత్యము నిన్నే తల్చుకుంటూ ఉంటాను, నా ప్రియురాలివిగా!!''

ఆమె అతని విశాలనేత్రాలకేసి చూసింది. తనయందెంత ప్రేముందో గ్రహించుకొంది. ఉష అతని హృదయాన్ని మృదువుగా స్పందించింది. ఆ నిముషంలో ప్రూన్పడి నిలచిపోయింది.

తలుపులుమీద గుద్దులు వినబడ్డాయ్. మిలిటరీ తలుపులు తెరవమని కోరుతోంది.

ఆమె తండ్రి కంఠస్వరము వింది. ఉష జనానాలో ఉంటుందంటున్నాడు తండ్రి. ఆమె ముందరి గదిలోంచి బయటకు వచ్చింది.

సిపాయీ గుంపులో హిందూ స్త్రీలు కూడా ఉన్నారు. ఒకామె ముందుకువచ్చి ఉషను కౌగలించుకొంది. 'నాతో రా, యీ ఉపద్రవంనుంచి

బయటకు పోదాం' అంది. ఉష ఆమె ననుసరించింది.

"నువ్వు ఖైదుచేయబడ్డావు" అన్నాడు కరీంతో సిపాయీ పెద్ద. కరీం మాట్లాడలేదు. కాని ప్రేమపూరిత చూపులను ఉషపై ప్రసారించాడు.

"అతన్నెందుకు ఖైదుచేస్తారు" అంది నెమ్మదిగా.

"అది నీకు తెలిసేఉండాలి" అన్నాడు తండ్రి. "నీ భర్తను హాయంచేసినందుకు, నిన్ను దొంగిలించి పెళ్ళిచేసుకున్నందుకు."

"అది వట్టి అబద్ధం. నా భర్తను అతను చంపలేదు. నన్ను కసాయిలనుంచి కాపాడిం దతడే."

గద్దించి అన్నాడు తండ్రి "అతను నిన్ను పెళ్ళికూడా చేసుకోలేదంటావు అనుకుంటాను."

"ఔను. అతడ్ని నా యిష్టంచొప్పునే పెళ్ళిచేసుకున్నాను. నా యిష్టంచొప్పునే అతని యింటికి కూడా వచ్చాను" అన్నది ధైర్యంగా ఉష. ఆమెను అంతకుముందు కౌగలించుకున్న స్త్రీ కూడా వదిలింది.

"నువ్వు ఏమి చెబుతున్నావో నీకేమైనా తెలుసా?" భయపడకు. బిడ్డా! వీళ్ళూ మనల్ని జాగ్రత్తగా తీసుకువెళ్తారు. ఈ ముస్లిం దుర్మార్గులకి మనం భయపడనక్కరలేదు. అతను నిన్నేమీ చెయ్యలేడు. నీ పెళ్ళికూడా న్యాయసమ్మతం కాదు. నువ్వు అలా చెయ్యడానికి బలాత్కరింపబడ్డావు. కాదూ?

"నేను చెప్పేది నాకు తెలుసు. నా యిష్టంచొప్పునే నేనతనిని పెళ్ళిచేసుకున్నా" అంది నిర్భయంగా.

"నువ్వు! పిశాచీ! నువ్వు నాకూ హిందూమతానికీ కళంకాన్నివి". తండ్రికళ్లు ఎర్రపడ్డాయ్. "గ్రహించావా? ముస్లిం నీచుడ్ని పెళ్ళాడుతావా?"

"నువ్వు అలాగ తిట్టి నీ కూతుర్ని అవమానపరిచావంటే నీగొంతుకు పిసికేస్తా... పిరికిపందా!" కరీం రౌద్రాకారానికి ముసలితండ్రి గజగజలాడిపోయాడు.

రక్షకసంఘం అక్కడ చేయవలసినదేమీ లేకపోయింది. వారు వెనక్కి తగ్గారు.

అశ్రుధారలతో చారలుబడ్డ బుగ్గలతో, ప్రేమపూరిత నయనాలతో ఆనందాశ్రువులు రాలుస్తూ అబ్దుల్ కరీం ముహంలోకి చూసింది ఉష.

# ఆస్థాన కవులు!

* బి. వి. రమణయ్య *

ఆగస్టు 15-వ తేదీనుంచీ మనకి ప్రజాప్రభుత్వం వచ్చిందంటూ సంతోషిస్తున్నాము; జమీందారీలూ, సంస్థానాలూ రద్దయి పౌరహక్కులు భద్రపడుతాయంటూ అనుకొంటున్నాం. ఇలాంటి సందర్భంలో మన ప్రభుత్వ విద్యాశాఖవారు మళ్లీ ప్రజాప్రభుత్వంలో సంస్థానాలనీ, ఆస్థానాలనీ నిర్మించి, 'ఆస్థానకవులను' ఏర్పరచడానికి పూనుకోవడం వింతగా వుంది!

ప్రత్యేక ప్రభువు లేనప్పుడు ఆస్థానంఎక్కడ? ఆదెవరిది? ఆస్థానకవులు ఎవర్ని పొగుడుతూ గ్రంధాలు రాయాలనీ, కవిత్వం కట్టాలనీ మంత్రి తలచాడో బోధపడకుండావుంది.

అప్పుడే కొన్ని తెలుగుపత్రికలు తమ తమ అభిప్రాయాలని వివరిస్తూ, తగిన ఆస్థానకవుల పేర్లుకూడా సూచించాయి.

ఆలోచిస్తే యిందులో ఒక రహస్యం వున్నట్టు కనబడుతున్నది. విద్యాశాఖకూడా లాభకారిగా పనిచెయ్యాలనే వుద్దేశం ప్రభుత్వానికి వున్నట్టు గోచరిస్తున్నాది. ఒకర్ని ఆస్థానకవి అంటూ నిలిపి, ఆయనచేత తమకి కావలసిన పద్యాలూ, పాటలూ అవీ రాయించుకుని ప్రభుత్వం అచ్చువేసి, విద్యాశాలల్లో వాటినే పఠనీయాలుగా పెట్టి లక్షలకొలదీ లాభం సంపాదించొచ్చు! ఏడాదికి వెయ్యిరూపాయిలు పారేశి, ఆ కవిగారి మూతి కట్టవచ్చు.

ఐదేళ్ళకోసారి పుస్తకాలు మారే ఆచారం వుండడంచేత—మరోకవిని ఏర్పాటుచేసి కొత్త పద్యాలూ, అవీ రాయించవచ్చు. ఇలా జరిగించడంవల్ల ప్రభుత్వానికా లాభమూ, ప్రజలకా ప్రభుత్వంమీద మంచి అభిప్రాయం కలగడమూ జరగవచ్చు.

ఈ అభిప్రాయంతోనే ఈ ఏర్పాట్లు జరిగితే ప్రతిష్ఠలు కలిగి, అవి నిలుపుకోవాలని అనుకున్న ఏ కవీ యీ పద్ధతికి అంగీకరించకూడదు.

అయినా—ఆస్థానకవు లనే పేరుతో కవులని ఎన్నుకోవడం ఏమిన్నీ బాగులేదు. అలా జరిగిస్తే యిది ప్రజాప్రభుత్వం కాక ప్రభువుల ప్రభుత్వమే అని చెప్పవలసివస్తుంది.